

దళితులను అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి - సీతానగరం

పెత్తందార్ల చేతిలో హత్యకు గురైన బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న దళితులను పోలీసులు అడ్డుకోవడం దారుణమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మట్టాడి వెంకటరమణ తెలిపారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షంలో ఒక దళిత యువకుడిని అతి దారుణంగా కొట్టి చంపేశారు. పలువురిని గాయపరిచారు. ఈ మేరకు వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న దళితులను పోలీసులు కక్షపూరితంగా అడ్డుకోవడం దారుణమన్నారు. జిల్లా నాయకుడిని గృహనిర్బంధానికి గురిచేయడం హక్కులను కాలరాయడమేనన్నారు. ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపుతుందన్నారు. రాముకు న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లో వినతి పత్రాలు అందిస్తామన్నారు.

విలువలతో కూడిన జర్నలిజం అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విలువలతో కూడిన జర్నలిజం అవసరమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో సి.రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో 'జర్నలిజంలో డిప్లమో కోర్సుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. పట్టణ - గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంచడం, జర్నలిజంలో విద్యార్హత కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ కోర్సును తీసుకొచ్చిందన్నారు. కరస్పాండెన్స్ విధానంలో (ఆన్ లైన్) క్లాసుల నిర్వహణ ఉంటుందన్నారు. జర్నలిస్టులతో పాటు, జర్నలిజంపై ఆసక్తి ఉన్న యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కోసం ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా 8,699 మంది జర్నలిస్టులకు ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందించామని ఆయన తెలిపారు. ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కోర్సు కోసం నాగార్జున యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నామని తలిపారు. నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. https://pressacademy.ap.gov.in వెబ్ సైట్ నుంచి దరఖాస్తులు డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 15లోగా అందించాలన్నారు. జర్నలిస్టులకు రూ.1,500, జర్నలిజం పట్ల అభిరుచి కలిగిన ఇతరులకు రూ.2వేలు ఫీజుగా నిర్ణయించామన్నారు. ప్రెస్ సెక్రటరీ, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ పేరే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలని కోరారు. జర్నలిస్టులకు ఇంటర్మీడియేట్, ఇతరులకు డిగ్రీ కనీస విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎఆర్‌వి.సత్యనారాయణమూర్తిని, చిరుకూరి సాయిబాబాలను మంత్రి వేణు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రెస్ అకాడమీ అకాడమిక్ డైరెక్టర్ ఎల్‌వి.కృష్ణారెడ్డి, కార్యదర్శి బాల గంగాధర్‌తిలక్, ఒఎస్‌డి ఎస్.శ్రీనివాస్‌జీవన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ఇళ్ల నిర్మాణాల తర్వాతే ఎన్నికలకు

ప్రజాశక్తి - గోపాలపురం

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన తరువాతనే ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు వెళ్తారని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు తెలిపారు. శుక్రవారం దొండపూడిలో 3వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తలారి మాట్లాడారు. మండలంలో 1,267 డ్వాక్రా గ్రూపులకు రూ.10,07,85,028 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకూ గోపాలపురం నియోజకవర్గంలో రూ.170 కోట్లు జమచేసిందన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. స్వయం ఉపాధి పొందాలనుకునే మహిళలకు ప్రభుత్వపరంగా అండదండలు ఉంటాయని తెలిపారు. పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు ఇళ్లను నిర్మిస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలు లేనివారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఈళ్ల భాస్కర్‌రావు, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, వెలగా శ్రీరామమూర్తి, మండల సమాఖ్య అధ్యక్షులు వింత శ్రావణి, ఎపిఎం సృజని, సర్పంచులు మల్లిపూడి అచ్చిబాబు, కురుకూరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

సర్పంచ్ చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- కడియం

మండలంలోని జేగురుపాడుకు చెందిన రైతులు కడియం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించట్లేదని సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ దృష్టికి తీసుకువెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో గ్రామానికి చెందిన పైడిముక్కల వీరరాఘవులు, మరొక రైతుకు సంబందించిన విద్యుత్ మోటార్లు 20 రోజులుగా పనిచేయట్లేదు. దీంతో సాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి. వారు పలుమార్లు మండల స్థాయి విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా స్పందిచలేదని సర్పంచ్‌కు తెలిపారు. స్పందించిన స్టాలిన్ రైతులు, స్థానిక నాయకులతో కలిసి పొలాలను, పాడైన ట్రాన్స్ ఫార్మర్‌ను సందర్శించారు. అక్కడి నుండే సమస్యను ఉన్నతాధికారులకు వివరించారు. తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆగమేఘాలపై స్పందించిన అధికారులు గంటల వ్యవధిలోనే నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటలక్ష్మి తదితరులు

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రంగంపేట(రాజానగరం)

ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన 'చలో ఢిల్లీ'కి సంబంధించి పోస్టర్‌ను సిఐటియు జిల్లా నాయకులు కొండా వెంకటలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భం వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం రంగ సంస్థలను, ప్రజల సంపదను విదేశీ స్వదేశీ సంస్థలకు అప్పగిస్తుందన్నారు. తద్వారా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లుకు అప్పగించేందుకు చూస్తుందన్నారు. మోడీ పాలనలో అన్ని ధరలూ ఆకాశాన్నంటాయన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశనకర విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో 104 అంబులెన్స్ వాహనాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాకు అదనంగా మరో పదహారు 104 వాహనాలను కేటాయించారన్నారు. ఒక్కొక్క వాహనాన్ని రూ.24 లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేశారన్నారు. వీటిలో 15 వాహనాలను వివిధ మండలాలకు కేటాయించామన్నారు. ఒక వాహనం స్పేర్‌గా ఉంచి అవసరం మేరకు వినియోగిస్తామని తెలిపారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ముప్పై నాలుగు 104 అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటి ద్వారా అన్ని అనారోగ్యాలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. గర్భిణిలకు, బాలింతలకు వైద్య పరీక్షలు సైతం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


104 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వనిత


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ట్రూఅప్ ఛార్జీలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో నిడదవోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒక వైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరో వైపు సర్దుబాటు ఛార్జీల పేరుతో దొడ్డి దారిన భారాలు వేయడం దారుణమన్నారు. ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఇక నుంచి ప్రతి నెలా యూనిట్‌కు 40పైసల చొప్పున అదనంగా ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేస్తారన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మరో వైపు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో దోపిడీ ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. వెంటనే భారాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.నాని, అనిల్, వి.ప్రభాకర్‌రాజు, ఆనంద్, లెనిన్, నాగేంద్ర, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

వైసిపి ప్రభుత్వం రైతు పక్షపాతి : గిరజాల

ప్రజాశక్తి- కడియం

వైసిపి ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడియం సహకార బ్యాంకు చైర్ పర్సన్ గిరజాల బాబు పేర్కొన్నారు. ది కడియం విశాల సహకార పరపతి సంఘం మహాజన సభ శుక్రవారం బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో గత ఆర్థిక సంవత్సరం జమ ఖర్చులు, వచ్చే ఏడాది అంచనా బడ్జెట్ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ అప్పులు సకాలంలో చెల్లించి సంఘం ఎన్‌పిఎ తగ్గించాలని సభ్యులను కోరారు. సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని రైతులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిఇఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరజాల నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి వెంకట్రావు, పంపన గోవిందు, వర్సాల వీర్రాజు, ఆర్ఎస్ఎన్.మూర్తి, బండారు లక్ష్మీశ్రీనివాస్, కుసునూరి బాబులు, రైతు నాయకులు కొత్తూరి బాలనాగేశ్వరరావు, చిక్కాల శ్రీను, దొడ్డా బుజ్జి, బొమ్మిరెడ్డి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వార్డు సభ్యుల రాజీనామా

ప్రజాశక్తి- గోకవరం


మండలంలోని తంటికొండ పంచాయతీలో నలుగురు వార్డు సభ్యులు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కెవిఎస్ఎస్.మూర్తికి అందించారు. వారు మాట్లాడుతూ తంటికొండ దేవస్థానానికి సిసి రోడ్డు నిమిత్తం రూ.5 లక్షల నిధులను జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు తీర్మానం చేయాలని పంచాయతీ కార్యాలయంలో 6న నోటీసు ఇచ్చామన్నారు. నేటికీ ఈ మేరకు తీర్మానం చేయలేదన్నారు. సర్పంచ్ వైఖరితో విసిగి రాజీనామా చేశామని తెలిపారు. గ్రామ పంచాయతీలో 2, 3, 6, 12 వార్డుల సభ్యులు ఆకుల గంగాభవాని, పెంట కోట కృష్ణ, బదిరెడ్డి సూర్యనాగకళ్యాణ్, బదిరెడ్డి సుబ్బలక్ష్మి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గ్రామానికి చెందిన ఓం నమశ్శివాయ సంక్షేమ సేవా సంఘం సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా సేవా సంఘం అధ్యక్షులు ఎం.సూర్యప్రకాష్ మాట్లాడారు. నూరుశాతం మార్కులతో అందరూ ఉతీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గుర్రాల రామ్మోహన్, గాజుల సత్తిబాబు, గంటి రామకృష్ణ పాల్గొన్నారు. వీరిని సర్పంచ్ అన్నందేవుల చంటి, హెచ్ఎం.ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్టూ'నిజం'



భూ రీసర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను జెసి ఎన్. భరత్‌తేజ్, ఆర్‌డిఒ చైత్రవర్షిణి శుక్రవారం పరిశీలించారు. భూ రీ సర్వే తహశీల్దార్ అంబటి రజిని ఆధ్వర్యంలో చేస్తున్న భూ రిసర్వే అప్పీలును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గడువులోగా భూరీసర్వేను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలోని నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా గుర్తించిన భూములను జెసి పరిశీలించారు. స్థలాల కోసం సుమారు 20 ఎకరాలు భూమిని సేకరించాల్సి ఉంటుందని అధికారులు జెసికి తెలిపారు. గోకవరం, కృష్ణపాలెంలో గుర్తించిన భూములను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రెవెన్యూ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణరావు, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ దివ్యభారతి, మండల సర్వేయర్ రవికాంత్, ఆర్ఐ శ్రీరాములు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి డ్వాక్రా భవనం సిద్ధం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో డ్వాక్రా సభ్యుల కోసం నిర్మించిన భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పక్కా భవనం లేక పెరవలి సెంటర్‌లో అద్దె భవనంలో విధులు నిర్వహించేవారు. కొంతకాలం ముక్కామలో, ప్రస్తుతం కానూరు ప్రభుత్వ భవనంలో ఈ కార్యాలయం కొనసాగుతోంది. ఎంతో కాలంగా పక్కా భవనం లేక పోవడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఈ ఇబ్బందులను గుర్తించి ఎంపిపి కె.సీతారాంప్రసాద్ మండల పరిషత్ సాధికార నిధులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. మండల పరిషత్ భవనాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి - పెరవలి

ముక్కామల ఆర్‌బికె వద్ద శుక్రవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ కేతా త్రిమూర్తులు ప్రారంభించారు. అనంతరం పశు వైద్యాధికారి సల్మా మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24 వరకూ టీకాలు వేస్తామని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నీరసపడతాయన్నారు. పాల దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. చూడి పశువులకు గర్భస్రావం అవుతుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా రైతులందరూ విధిగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పశు వైద్యాధికారి ఎఆర్.సోమేశ్వరి, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల్లో చైతన్యం ముఖ్యమని, ఆర్థికంగా స్వశక్తిపై ఆధారపడినప్పుడే ఆ ప్రాంతం అన్ని రకాలుగా ప్రగతి పథంలో పయనిస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని 48, 49 డివిజన్లలోని డ్వాక్రా మహిళలకు 'వైఎస్ఆర్ ఆసరా' పథకంలో భాగంగా మూడవ విడత రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పనస చెట్టు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నమూనా చెక్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పోలు విజయలక్ష్మి, 48వ డివిజన్ ఇన్‌ఛార్జి అజ్జరపు వాసు, 49వ డివిజన్ ఇన్‌ఛార్జి బర్రే కొండబాబు పాల్గొన్నారు.

పింఛను పంపిణీ ఆలస్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏప్రిల్ 1వ తేదీని సెలవుగా ప్రకటించడం, 2వ తేదీ ఆదివారం కావడంతో మార్చి నెలకు సంబంధించిన వైఎస్ఆర్ పింఛను ఈ నెల 3న పంపిణీ చేయనున్నారు. ఈ మేరకుకలెక్టర్ ఆదేశాలను అనుసరించి డిఆర్‌డి డైరెక్టర్ ఎస్.సుభాషిణి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని పింఛను దారులకు తెలియజేయాలని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ వాలంటీర్లు, సిబ్బందిని ఆదేశించారు.

'పెరవలి'లో మూడు పరీక్ష కేంద్రాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని పదో తరగతి పరీక్షలకు కానూరు, కాకపర్రు, ఖండవల్లి జడ్‌పి హైస్కూల్స్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు పరీక్ష కేంద్రాల్లో 746 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు ఎంఇఒ వెలగల హైమావతి తెలిపారు వీరిలో బాలికలు 269 మంది, బాలురు 477 మంది, ప్రయివేటు విద్యార్థులు 287 మంది పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలు 3వ తేదీ నుంచి 17 వరకూ జరుగనున్నాయి. హాల్ టికెట్ ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు సదుపాయం ఉందని తెలిపారు.


విద్యార్థులతో మాంటిస్సోరి యాజమాన్యం,ఉపాధ్యాయులు

ఉత్సాహంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థులు ఎంతటి స్థాయిలో ఉన్న చిన్ననాటి స్నేహితులను, పుట్టిన ఊరును మరువరాదని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వ్యవస్థాపక కరస్పాండెంట్ అనీష్ సూచించారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనీష్ మాట్లాడుతూ పరీక్షల బాగా రాయాలన్నారు. ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల అధ్యాపక బందం పాల్గొన్నారు.

22 వాహనాలకు అపరాధ రుసుం

చాగల్లు : నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న 22 వాహనాలకు సంబంధించి రూ.14వేల వరకూ అపరాధ రుసుము వేసివసూలు చేశామని ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు. వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తణుకుకు చెందిన మై ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పాలంగిలో బస్టాప్ వద్ద దీన్ని ఏర్పాటు చేశారు. సభ్యులు మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకూ అన్ని రోజులూ వాహనదారులకు, ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీకి తణుకుకు చెందిన తమరాపు సూర్యనారాయణ తనయుడు మురళీకృష్ణ రూ.వేయి సాయం అందించారన్నారు.

మాంసం దుకాణాల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-గోకవరం

మాంసం దుకాణాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్ తెలిపారు. మండలంలో పలువురు మాంసం దుకాణదారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసం దుకాణాల యజమానులకు పలు అంశలను వివరించారు. ఆరోగ్యంగా ఉన్న పశువులనే కోయాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేకలను పశువుల డాక్టర్‌కు చూపించి పంచాయతీ సమక్షంలో పంచాయతీ ముద్ర వేయించాలని, వాటిని మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఇప్పటివరకు మేకలకు ఎటువంటి వ్యాధులు సోకలేదన్నారు. కొన్ని రోజుల క్రితం ఆవులకు, పందులకు మాత్రమే లంపిస్కిన్ సోకిందన్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, ఊరుకు మంచి పేరు తేవాలని మానవతా మండల శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలో గల శ్రీ అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 72 మంది విద్యార్థులకు మానవతా శాఖ శుక్రవారం అల్పాహారాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, ఇసి మెంబర్ సనపల రాజశేఖర్, పూర్వపు అధ్యక్షులు అప్పన చంద్రధరగుప్త, హెచ్ఎం దొండపాటి అర్జునుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాల అందజేత

ప్రజాశక్తి - తాళ్లపూడి

జిల్లాలోని వివిధ గ్రామాల్లో నివాసం ఉంటున్న ఆరుగురు వికలాంగులకు రూ.20 వేల విలువైన ఉపకరణాలను అందించామని చిడిపి గ్రామానికి చెందిన దేవోక్తి చిలిపి సోషల్ సర్వీస్ అధినేత ప్రత్తిపాటి అబేదేనేగో తెలిపారు. కొవ్వూరుపాడు, తుపాకుల గూడెం, పోలవరం, ఇటుకలకోట, దువ్వ గ్రామాల్లో వికలాంగులకు వీటిని అందించారు. దాత వేములూరి రాజకుమార్ సహకారం అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- చాగల్లు

పోషకారంతోనే ఆరోగ్యం పొందొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డివిఎస్ఆర్ఎస్.కుమారి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ సమిశ్రగూడెం ప్రాజెక్టు మార్కొండపాడు సెక్టారులో పోషణ పక్వాడ వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిరి ధాన్యాలతో పోషక విలువలతో ఆహారాన్ని తయారు చేసే విధానాన్ని గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సొసైటీ అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - చాగల్లు

ఉన్నగట్ల సొసైటీకి సంబంధించి 2023-24 అంచనా బడ్జెట్‌కు ఆమోదం లభించింది. సొసైటీ మహాజనసభ శుక్రవారం సొసైటీ సమావేశ మందిరంలో సొసైటీ అధ్యక్షులు ఆత్కూరి దొరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారని సొసైటీ కార్యదర్శి కె.శ్రీనివాస తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు నాగార్జున, మెరుపు వరలక్ష్మి, సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - గోపాలపురం

సచివాలయాలు, వాలంటర్లీ వ్యవస్థల రూపకల్పనతో దేశంలోని రాష్ట్రాలకు ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం భీమోలులో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె, ఆరోగ్య కేంద్ర భవనాలను సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఎంఎల్ఎ తలారి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18 సచివాలయాలు, నియోజకవర్గంలో 81 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. నాలుగైదు గ్రామాల్లో ఇప్పటికే ఆర్‌బికెలను ప్రారంభించామన్నారు. మిగిలిన వాటిని ఏప్రిల్ నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు కాకులపాటి లలిత, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, వైసిపి మహిళా విభాగం మండల అధ్యక్షులు ఎండపల్లి కవిత, సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కోడె రామలక్ష్మి, వెలగా శ్రీరామ్మూర్తి, కురుకూరి ధనలక్ష్మి, రాంపండు, సాయి, ఎం.రవి, ఎస్‌కె.ఖాదర్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో దోమల నియంత్రణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రజల భాగస్వామ్యంతో దోమల నియంత్రణకు కృషి చేయాలని ఫ్రై డే, డ్రై డే, సెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చివటంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద వాలంటర్లీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దోమల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇందులో ప్రజలను భాగస్వామ్యులను చేయడం అత్యంత అవసరమన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, ఆశాలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కె.కృష్ణవేణి, విఆర్ఒ ఎ.రాజశేఖర్, ఆరోగ్య కార్యదర్శి డి.సూర్యకుమారి, ఎంఎల్‌హెచ్‌పి కె.విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, ఆశాలు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

దళితులపై దాడులకు నిరసనగా మద్దూరు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వమించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో రోజురోజుకూ దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రశ్నించే దళితులు, నాయకులు, సామాజిక ఉద్యమకారులపై నిర్బంధం ప్రయోగిస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కోనసీమలో అంబేద్కర్ జిల్లా పేరును వ్యతిరేకిస్తూ విధ్వంసం సష్టించిన శక్తులపై ప్రభుత్వం కేసులు ఎత్తివేయడమే కాకుండా నాయకుల్ని సాక్షాత్తు సిఎం జగన్ ఆలింగనం చసుకోవడం సిగ్గుచేటన్నారు. ఇది దళితుల్ని అవమానించడమేనన్నారు. శృంగవృక్షంలో హత్యకు గురైన కుటుంబాన్ని పరామర్శించకుండా దళితులను అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మరపట్ల రాజు, ఆనంద్, రమేష్, నాని, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళితులు

నేరాలు ఘోరాలు



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బాలుడి బంధువులు

టెన్త్ విద్యార్థి అనుమానస్పద మృతి

ప్రజాశక్తి - పెదపూడి



సాయిదుర్గ (ఫైల్)

పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో పదో తరగతి విద్యార్థి ఈతకు వెళ్లి కోనేరులో అనుమాన స్పదంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు మృతదేహంతో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు, పెదపూడి ఎస్ఐ వాసు, డిఇఒ అన్నపూర్ణ, పాఠశాల హెచ్ఎం.కె.శ్రీనివాసు, తదితరులు ఆందోళన కారులతో మాట్లాడారు. దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఆందోళన విరమింప చేశారు. సీఐ శ్రీనివాసు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మామిడాడ గ్రామానికి చెందిన పేరురి వెంకన్న, దుర్గ దంపతులకు రెండో సంతానం సాయిదుర్గ(16) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రతి రోజు మాదిరిగా సాయిదుర్గ పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులు గ్రూప్ పోటో తీయించుకున్న అనంతరం సాయిదుర్గతోపాటు జి. సూర్యతేజ, కె.అనిల్ కుమార్, కె.వంశీ, అఖిల్ ఆదిత్య ఐదుగురు సాయిదుర్గ ఇంటి వద్ద స్కూల్ బ్యాగ్ పెట్టి కోనేరులో స్నానానికి వెళ్లారు. అక్కడ అఖిల్ ఆదిత్య. సాయిదుర్గ ఇద్దరు కోనేరులో స్నానానికి దిగారు. ఇద్దరు చెరువులో ఉండగా మిగిలిన ముగ్గురు మతులు ఇంటికి వచ్చి బ్యాగ్‌లు తీసుకుని వెళ్లిపోయారు. కొంతసేపటికి కోనేరులో సాయిదుర్గ మునిగిపోయడంటూ స్థానికులు, అఖిల్ ఆదిత్య, సాయిదుర్గలను గట్టుపైకి తీసుకొచ్చారు. వెంటనే విద్యార్థులు ఈవిషయం ఉపాధ్యాయులకు తెలియజేసి స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సాయిదుర్గ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధుమిత్రులు తన కొడుకుని తోటి విద్యార్థులు చంపేశారంటూ పాఠశాల వద్ద మెయిన్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అలాగే ఉపాధ్యాయులు పాఠశాల నుంచి ఎందుకు బయటకు పంపించారంటూ మీరే బాధ్యులంటూ ఆరోపించారు. కొంత సేపటికి ట్రాఫిక్ జామ్ అయింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లి దండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులుతో మాట్లాడారు. తోటి విద్యార్థులతో జరిగిన సంఘటనపై వివరాలు నమోదు చేశారు. ఈ సంఘటనపై తండ్రి వెంకన్న పిర్యాదుపై అనుమానస్పద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.. దీంతో ఆందోళన విరమించారు. మృతుడి తండ్రి, తల్లి, అన్నయ్య ఫణి దుర్గ చేపల వ్యాపారం చేస్తుంటారు.

కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి -కరప

కరప శివారు పేపకాయల పలెం గ్రామంలో కరెంట్ షాక్‌తో యువకుడు మతి చెందినట్టు గ్రామస్తులు పోలీసులు తెలిపారు. పేపకాయల పలెం గ్రామానికి చెందిన పేపకాయల వెంకటరమణ ఇటీవల గ్రామంలో ఓంశాంతి బిల్డింగ్ సెంటర్ వద్ద నూతనంగా ఒక డాబా ఇల్లు నిర్మిస్తున్నాడు. ముంబై టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లో జాబ్ చేస్తున్న మూడో కుమారుడు పేపకాయల మణికంఠ (23) ఇంటి వద్ద నుండే విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 6.30 గంటలకు సదరు ఇంటి గోడలు తడపడానికి మోటర్ పంపు ఆన్ చేయగా అది పనిచేయలేదు, స్విచ్ ఆన్ చేసిన సంగతి మర్చిపోయిన మణికంఠ ఆ మోటర్ పంపుని రిపేర్ చేస్తుండగా ప్రమాద వశాత్తూ విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 లో కాకినాడ జిజిహెచ్ కు తరలించారు. మణికంఠను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కరప పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకష్ణ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం జి.మేడపాడు-బిక్కవోలు రలైవ్వే స్టేషన్‌ల మధ్యలో విజయవాడ వైపు వెళ్ళే ఎగువ ట్రాకుపై శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం గుర్తు తెలియ నంతగా చిద్రం అయింది. సామర్లకోట కీ మేన్ బన్వర్‌లాల్ మీనా సమాచారం మేరకు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ పి.నంత లక్ష్మి ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసి సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గ్రామంలో శుక్రవారం ఒక మహిళ మెడలో బంగారు గొలుసులు దొంగలు చోరీచేసినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కోటిపల్లిలో సాధనాల వరలక్ష్మి కోటిపల్లిలో గల ఒక కిళ్లీ కొట్టు పక్కన నిలుచుంది. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని రెండు కాసులు బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారని తెలిపారు. ఈ మేరకు ఆమె కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ చిరంజీవి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతినే రాజధానిగా ప్రకటించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని సిం జగన్ ప్రకటించాలని టిడిపి సీనియర్ నాయకడులు, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉగాది తర్వాత విశాఖ నుంచి పాలన సాగిస్తామని సిఎం జగన్‌కు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలతో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. అమరావతి ప్రాంత రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమం 1200 రోజులకు చేరిన నేపథ్యంలో రైతుల ఉద్యమానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



వృద్ధులకు పేస్ట్‌లు అందజేస్తున్న దంత వైద్యులు

వృద్ధులకు దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కాకినాడరూరల్

అంతర్జాతీయ డిసెన్సిటైజింగ్ దినోత్సవం సందర్భంగా స్థానిక రమణయ్యపేట దంత వైద్య శాలలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో వృద్ధులకు డిసెన్సిటైజింగ్ పేస్టును ఉచితంగా అందజేసి, దంత వైద్య పరీక్షలు చేశారు. ఐడిఎ అధ్యక్షుడు డాక్టర్ వెదురుపాక సతీష్ మాట్లాడుతూ 'దంతాలు సున్నితంగా తయారై సలుపు పెడితే ప్రత్యేకంగా రూపొందించిన డీసెన్సిటైజింగ్ టూత్ పేస్ట్ వాడటం వలన ఉపశమనం లభిస్తుందన్నారు. డాక్టర్ అడ్డాల సత్య నారాయణ మాటాడుతూ గట్టిగా బ్రషింగ్ చేయడం వల్ల దంతాలలో సున్ని తత్వం పెరిగి, ఎనామెల్‌ను దెబ్బ తింటుందన్నారు. డాక్టర్ సువర్ణ బ్రషింగ్ విధానాన్ని చార్ట్‌ల సహాయంతో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయి కార్తిక్, చైతన్య, వృద్ధులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై అశ్రద్ధ తగదు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ప్రస్తుత జీవన విధానంలో మితిమీరిన సామాజిక మాధ్యమాలు ఉపయోగించడం, పెద్ద శబ్దాలు వినడం వల్ల చిన్న, పెద్ద తేడా లేకుండా వినికిడి సమస్యలు వస్తుంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని డాక్టర్ గుబ్బల లక్ష్మణ ప్రసాద్ సూచించారు. సర్పవరం బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శక్తివంతమైన స్మార్ట్ ఫోన్లలో ఎక్కువసేపు మాట్లాడటం వలన అధిక రేడియేషన్ విడుదలై వినికిడి లోపం వస్తుందన్నారు. చెవిలో నూనె వేయడం ఇతర వస్తువులతో చెవిలో తిప్పకూడదని అన్నారు. పెద్ద శబ్దాలుగల మైక్ సెట్‌లను ఉపయోగించరాదని డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసి నాగమణి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం



కామిశెట్టి నాగమణి (ఫైల్)

పెద్దాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన గుడివాడ, సిరివాడ ఎంపిటిసి కామిశెట్టి నాగమణి (50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, ఎండిఒ కరక హిమ మహేశ్వరి, వైస్ ఎంపిపిలు కంటే ప్రభావతి, మిరియాల లోవరాజు, గుడివాడ, సిరివాడ సర్పంచ్‌లు కనపర్తి నూకరాజు, వినుకొండ కృష్ణకుమారి సంతాపం వ్యక్తం చేశారు.

యానాం వార్తలు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు విడుదల -ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి 7నెలల జీతాలకు సంబంధించి రూ.15లక్షల ఒక వెయ్యి 689 ను మంజూరుచేస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎ పునీతమేరీ ఉత్తర్వులు జారీచేసారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ .శుక్రవారం తెలిపారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకున్న సంబంధిత ది యానాం మల్టీ పర్పస్ సర్వీస్ ప్రొవైడర్స్ సంస్థకు ఈ మొత్తాన్ని మంజూరు చేసిందన్నారు. ఇటీవల జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల గూర్చి అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. అదేవిధంగా సిబ్బందికి సంబంధించి బకాయిలతోపాటు ఇఎస్ఐ, ఇపిఎఫ్, జిఎస్ తదితర బిల్లులు ప్రతినెలా చెల్లించాల్సివుంటుందని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కాపీని జిజిహెచ్ డిప్యూటీ డైరెక్టర్ కు పంపినట్లు తెలిపారు

వరద నుంచి రక్షణకు రూ.139 కోట్లతో పనులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

యానాం నియోజకవర్గాన్ని గోదావరి వరదలనుంచి రక్షణ కల్పించేవిధంగా చేపట్టే వరద నియంత్రణ గట్టు నిర్మాణానికి రూ.139 కోట్లతో కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పిడబ్ల్యుడి మంత్రి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వరదరక్షణ ఏటిగట్టు నిర్మాణాన్ని త్వరితగతంగా చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి లక్ష్మీనారాయణ సమాధానమిచ్చారు. గత ఏడాది జూలై నెలలో భారీ వరదలు వచ్చిన నేపథ్యంలో పలు ప్రాంతాలు తీవ్రంగా ముంపుకు గురయ్యాయన్నారు. దీంతో లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించి అదేనెల 19న యానాంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించానని, అప్పుడే రక్షణగట్టుకు నిధులు మంజూరు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని అవి మంజూరయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు

విద్యార్థులతో మానవహారం

యానాం స్థానిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శుక్రవారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని హెచ్ఎం నళిని కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు వందమంది విద్యార్థినీ విద్యార్థులతో ఏక్ బారత్ శ్రేష్ఠ భారత్ (ఇబిఎస్ బి) అనే అక్షరాలతో మానవహారంగా మలిచారు. దానిలో భాగంగా పుదుచ్చేరి, కరైకల్, మాహే, యానాంకు చెందిన చిత్రాలతో కూడిన వాల్ మేగజైన్, ఫాన్సీ డ్రెస్, గ్రూప్ డాన్సులు, తమిళ్ వాక్యాలు, సామెతలు, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

4న మద్యం దుకాణాలు బంద్

యానాం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి వ్యాప్తంగా కారైకల్, మాహే,యానాంలలో ఈ నెల 4న మహావీర్ జయంతి సందర్భంగా యానాంలోని మద్యం దుకాణాలు, బార్లు మూసి వేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చిన్ననాటి నుంచే సేవా కార్యక్రమాలు

చిన్న వయసులోనే సేవా కార్యక్రమాలు చేయడం విద్యార్థులు అలవర్చుకోవాలని ఆర్ఎఒ మునిస్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయవీరన్ ఆధ్వర్యంలో ఇంచార్జి ప్రిన్సిపల్ ఎ.చంద్రశేఖరన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ 2023 ను ఆర్ ఎ ఒ మునిస్వామి ప్రారంభించి,. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వి వి ఎల్ పి రాజు,సాధనాల బాబు,నాగ అజ్మీర,వాలంటీర్లు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు రూ.76 లక్షల వైద్య పరికరాల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ



యంత్రాన్ని ప్రారంభిస్తున్న దర్శకుడు రాఘవేంద్రరావు

కాకినాడ సీ పోర్టు సిఎస్ఆర్ నిధులు రూ. 76 లక్షలతో జిజిహెచ్‌కు మెడికల్ అనస్తీసియా ఉపకరణాలు, వెంటిలేటర్లను సమకూర్చింది. ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికాశుక్లా, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సినీ దర్శకులు కె.రాఘవేంద్రరావుతో కలిసి వీటిని ఆసుపత్రికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి గీత మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరితో పాటు పొరుగు జిల్లాల ప్రజలకు జిజిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఖాళీలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. మేజర్ సర్జరీలు చేసేందుకు వీలుకల్పించే పరికరాలు అందజేసిన సీపోర్ట్సు లిమిటెడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపోర్ట్స్ సిఎండి కెపి.రావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి, ఆర్ఎంసి ప్రిన్సిపల్ నరసింహం పాల్గొన్నారు.

పిల్లల ప్రాణాలను కాపాడేందుకు సాయం

కోరమాండల్ ఎడి శంకర సుబ్రహ్మణియన్

ప్రజాశక్తి - కాకినాడ



యంత్రాలను ప్రారంభిస్తున్న శంకర సుబ్రహ్మణియన్

పసి పిల్లల ప్రాణాలు కాపాడటం ఎంతో ఆనందానిచ్చిందని కోరమాండల్ ఎడి శంకర సుబ్రహ్మణియన్ అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.22 లక్షల సిఎస్ఆర్ నిధులతో జిజిహెచ్‌లో చిన్నపిల్లల వార్డులో బేబీ వార్మర్లు, ఫోటో థెరఫీ యూనిట్లు, ఎయిర్ కంప్రెషర్లు, వాక్యూమ్ పంపులు తదితరాలను సమకూర్చింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతకు కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకర సుబ్రహ్మణియన్ వీటిని శుక్రవారం అందజేశారు. జిజిహెచ్ పీడియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ ఎంఎస్.రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణియన్ మాట్లాడారు. పదేళ్లుగా చిన్నారుల ప్రాణాలను కాపాడటంలోనూ, వారి ఆరోగ్యాన్ని సంరక్షించడంలో, పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించడంలో తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. జిజిహెచ్ యంత్రాంగం సమన్వయంతో గత పదేళ్లుగా ఎంతో మంది పసిపిల్లల ప్రాణాలు కాపాడగలిగామన్నారు. తమకు అవకాశం కల్పించినందుకు కోరమాండల్ జిల్లా పాలనా యంత్రాంగానికి, జీజీహెచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ హేమలత మాట్లాడుతూ కోరమాండల్ ఇంటర్నేషనల్ సహాయంతో శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డిఎస్‌విఎల్.నరసింహం, సిపిఒ పి.త్రినాథ్, కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీర్ అల్వీ, కోరమాండల్ యూనిట్ హెడ్ సిహెచ్.శ్రీనివాసరావు, జిఎంహెచ్ఆర్ పద్మనాభం, జిజిహెచ్ వైద్యులు, సిబ్బంది, కోరమాండల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో లైట్ల ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి - కాకినాడ

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, కాకినాడ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ బీచ్ రోడ్ విద్యుదీకరణ, వీధి లైట్ల ఏర్పాటు కోసం రూ.30 లక్షల సాయం అందించింది. దీనికి సంబంధించిన డిడిని కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూట్రియంట్ బిజినెస్) శంకర సుబ్రహ్మణియన్ కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియకు శుక్రవారం అందజేశారు. కోరమాండల్ యాజమాన్యం వాకలపూడి, వలసపాకల గ్రామపంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపరచడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. పంచాయతీలలో ప్రజా అవసరాల నిమిత్తం కమ్యూనిటీ భవాల నిర్మాణం, ఆర్ఓ ప్లాంటు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోనికి తీసుకొస్తామని ఈ సందర్భంగా జెసికి వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ యూనిట్ హెడ్ సి.హెచ్.శ్రీనివాసరావు, జీఎం (హెచ్ఆర్) పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా రాజు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జియువిబి.రాజు, జనరల్ సెక్రటరీగా కవి హనుమంతరావు ఎన్నికయ్యారు. మొత్తం 15 మంది ప్యానల్ సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. వైస్ ప్రెసిడెంట్‌గా గేడెల వెంకటేశ్వరరావు, ట్రెజరర్ ఎంవి.దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సిహెచ్‌వి.రామారావుచౌదరి ఎన్నికయ్యారు. స్పోర్ట్స్ సెక్రటరీగా కెవి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లైబ్రరీ సెక్రటరీగా మేకా శ్రీనివాస్ రావు, లేడి రిప్రజంటేటివ్ కె.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. 30 సంవత్సరాలు పైబడిన కమిటి మెంబరు విభాగంలో ఎ.వెంకటరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 20 సంవత్సరాలు పై బడిన విభాగంలో సుమన్‌పాల్, 10 సంవత్సరాలు పైబడిన విభాగంలో లేడీ కమిటీ మెంబర్ ఎమ్‌డి హజీనా బేగం ఎన్నికయ్యారు. 5 నుంచి 10 సంవత్సరాలు పైబడిన విభాగంలో కమిటీ సభ్యులుగా ఎస్.తాతారావు, జి.దేవిభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2 నుంచి 5 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎం.నాగేంద్ర ఎన్నికయ్యారు. ఎలక్షన్ ఆఫీరుగా పి.రామరాజు, పర్యవేక్షకులుగా సిపిఆర్.రెడ్డి, పి.రమేష్, ఎం.సత్యపద్మిని, కె.మల్లేశ్వరరావు, కెఎల్.భవాని, ఎ.రూపారాజేశ్వరి, డి.ప్రసన్న, కెవి.ప్రసాద్, కె.హనుమంతరావు, మణికంఠ వ్యవహరించారు. నూతన కమిటీకి బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్లు, అడ్వకేటు గుమస్తాలు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ పథకాల లబ్ధిని, బ్యాంకు లింకేజీ రుణాలను ఆదాయ వనరులు ఒనగూరే రంగాలలో పెట్టుబడిగా పెట్టి మంచి పారిశ్రామికవేత్తలుగా రాణించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎస్ఎస్ జి మహిళలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు మహిళా పారిశ్రామికవేత్తలు అద్భుతమైన వస్తు, వస్త్ర ప్రదర్శన అమ్మకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో దిగ్గజ కార్పొరేట్ సంస్థలు బ్యాంకర్లు సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిజినెస్ ఉమెన్ ఎక్స్పో పలువురుని విశేషంగా ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దశ్యకళల అకాడమీ చైర్మన్ కుడిపూడి సత్య శైలజ, పురపాలక సంఘ అధ్యక్షులు రెడ్డి సత్య నాగేంద్ర మణి, ఎంపిపి కె.భాగ్యలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, సిపిఒ వెంకటేశ్వర్లు, చీఫ్ కోచ్ సురేష్ కుమార్, డిఐపిఆర్ఒ కె. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బయోడైవర్సిటీ'పై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల్లో ఎపి బయోడైవర్సిటీ బోర్డు ఐ క్యాప్ ప్రోగ్రామ్ లో భాగంగా సంగీత శ్రీ విద్యా వైద్య ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ చైర్మన్ వి.ప్రసాదం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, గ్రామ వైసిపి అధ్యక్షులు రావాడ సత్తి బాబు సమక్షంలో శుక్రవారం ఈ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంతరించి పోతున్న వక్షజాతిని కాపాడటం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను గురించి వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వ్యక్తిగతంగా తగ్గించుకోవాలన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ ప్రసాదం సహకారంతో 121 మంది విద్యార్థులకు పదవ తరగతి ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కర్రీ సంజీవరెడ్డి, హెచ్ఎం వెంకటలక్ష్మి, వి.విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసులు నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు వక్కలగడ్డ నాగేశ్వరరావు (88) శుక్రవారం మృతిచెందారు. ఆయన కపిలేశ్వరపురం సర్వారాయ హరికథా పాఠశాలలో 50 సంవత్సరాలుగా మృదంగ ఉపాధ్యాయునిగా సేవలు అందించారు. పలు రాష్ట్రాల్లో హరికథా ప్రదర్శనల్లో మృదంగ సహకారమందించి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వంటి ఎంతో మంది ప్రముఖుల నుంచి పురస్కారాలు అందుకున్నారు. అలాగే ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ కచేరీల్లోను మృదంగ సహకారమందించారు. మృదంగ నాగేశ్వరరావు మరణానంతరం కాకినాడ బాదం బాలకష్ణ ఐ బ్యాంకుకు తన నేత్రాలను దానం చేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

'నేటికీ దళితులపై కొనసాగుతున్న వివక్ష'

ప్రజాశక్తి-రాజోలు

సమాజంలో నేటికి దళితుల పై వివక్ష కొనసాగుతూనే ఉందని ఎస్‌సి కమీషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్ అన్నారు. రాజోలు రోటరీ భవనంలోతహశీల్దార్ బి.ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సివిల్ రైట్స్ డే సమావేశంలో పాల్గొన్న ఆనంద్ ప్రకాష్ మాట్లాడారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాల పై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో దళితుల సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులపై పోలీసులు బనాయించిన అక్రమ కేసులు ఎత్తేయలని, రాజోలు నియోజకవర్గంలో అంబేద్కర్ విగ్రహాలకు జరిగిన అవమానకర సంఘటనల్లో దోషుల అరెస్ట్ నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు అధికారిని నియమించాలని రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల తరుపున ఎస్‌సి కమిషన్ సభ్యులకు దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మెమొరాండం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్. బాలాజీరావు, ఎస్ఐ కృష్ణమాచారి, ఎంపిపి కేతా శ్రీనివాస్, వైస్ ఎంపిపి పొలుమూరి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో 'ఫియస్టా' జోనల్ కాంపిటేషన్స్

ప్రజాశక్తి-మండపేట



విజేతలతో ఎంఇఒ తదితరులు

తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్లో ప్రైమరీ విద్యార్థులకు ఫియస్టా జోనల్ లెవెల్ కాంపిటేషన్స్ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఒ ఐదం రాజు, ఎంఇఒ నాయుడు రామచంద్రరావులు ముఖ్యఅతిథిగా విచ్చేసిమాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించేందుకు జోనల్ కాంపిటేషన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రామచంద్రపురం, రావులపాలెం, అనపర్తి, తాపేశ్వరం బ్రాంచి విద్యార్థులు జోనల్ లెవెల్ లో పాల్గొనే నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి నరేష్, వైస్ ప్రిన్సిపల్ రాము, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఉమ, ప్రైమరీ, కో-ఆర్డినేటర్ శిరీష, డీన్ అరుణ్, సి-ఇన్‌ఛార్జి లీలాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు అరుంధతి పేటలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు దాత వంటిపల్లి పాపారావు రూ.1,25,000 విరాళాన్ని శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. గత ఏడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఆయన నగదును ఆలమూరు దళిత ఐక్య వేదిక సభ్యులకు అందజేశారు.